క్లుప్తంగా

నేడు షాదీఖానాను ప్రారంభించనున్న మంత్రి బుగ్గన



నూతనంగా పునర్నిర్మించిన షాదీఖానా

డోన్ : పట్టణంలో పోలీసుస్టేషన్ వద్ద షాదీఖానాను రూ.45లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి షాదీఖానాను(చాందిని ఫంక్షన్ హాల్) ప్రారంభిస్తారని కమిటీ అధ్యక్షుడు దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముస్లింలు సోదరులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో దర్గా కిటకిటలాడింది. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి అలంకరించారు. భక్తులు ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

బేతంచెర్ల: బనగానపల్లె రహదారిలోని కస్తూర్బా విద్యాలయం బాలికలకు గురువారం ప్రిన్సిపాల్ అబిదాబేగం ఆధ్వర్యంలో ఎంఈఓ సోమశేఖర్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూచించారు.

ఘనంగా శ్రీ మౌలాలిస్వామి జయంతి



మౌలాలిస్వామి వద్దకు ర్యాలీగా వెళ్తున్న ముస్లిం సోదరులు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని ఆస్థానంలోని శ్రీమౌలాలిస్వామి జయంతి వేడుకలను గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. బనగానపల్లె నవాబు వంశీయులు మీర్‌ఫజల్ అలీఖాన్, మత పెద్దలతోపాటు ముస్లిం సోదరులు ఆస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం అక్కడి నుంచి రవ్వల కొండపై వెలసిన శ్రీ మౌలాలిస్వామి దర్గా వరకు జెండాతో జులుసెగా (ర్యాలీ) వెళ్లారు. శ్రీమౌలాలిస్వామి దర్గాలో జెండా ఎక్కించి స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు కార్యక్రమాలు ఉంటాయని నవాబు వంశీయులు తెలిపారు.

నేడు కొండపై జాతీయ జెండా పండుగ

డోన్ : పట్టణంలోని ఆంజనేయస్వామి కొండపై 100 అడుగుల ఎత్తులో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. పట్టణానికి చెందిన సౌత్‌వెస్ట్ మైనింగ్ లిమిటెడ్ ఆర్థిక సౌజన్యంతో రూ.14లక్షలతో 100 అడుగుల ఎత్తు గల జెండా దిమ్మెను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్‌లతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొంటున్నట్లు చైర్మన్ తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఈఓ గోపీనాథ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గణతంత్ర వేడుకల సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల నరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతీ, యువకులు తరలివచ్చి రక్తదానం చేయాలని సూచించారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

బేతంచెర్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బేతంచెర్ల పట్టణంలో మాంసం విక్రయాలు నిషేధించినట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్లలో మాంసం విక్రయించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు చేయడమే కాకుండా, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజారోగ్యం... పదిలం!

- మంత్రి బుగ్గన చొరవతో డోన్ ఏరియా వంద పడకల హాస్పిటల్ నిర్మాణం
- కర్నూలు పెద్దాసుపత్రికి దీటుగా సకల వసతులు
- పదెకరాల్లో మూడు అంతస్తుల భవనం
- ఇప్పటికే వైద్యులతోపాటు 96 ఇతర పోస్టులు
- 28న ప్రారంభించనున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న డోన్ నియోజకవర్గ ప్రజలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రి

డోన్ : ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ఉచితంగా విద్య, వైద్యం పేద ప్రజలకు అందించగలిగితే నగం పేదరికాన్ని నిర్మూలించినట్లేనని దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలలు సాకారం చేస్తూ ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల గ్రామాలకు సైతం వైద్యం అందేలా పాలన సాగిస్తున్నారు. నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిన వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించడంతోపాటు వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు ప్రతి కుటుంబానికి వైద్య చికిత్సల కోసం రూ.20లక్షల వరకు వర్తింపజేసిన విషయం అందరికీ తెలిసిందే. గ్రామీణ సచివాలయ పరిధిలో విలేజ్ క్లినిక్‌లు, పట్టణ సచివాలయాల పరిధిలో అర్బన్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించింది ప్రభుత్వం. ప్రత్యేకించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అందరి మన్ననలు పొందుతోంది. అదేవిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డోన్ ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సైతం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారు. మంత్రి బుగ్గన చొరవతో డోన్ ఏరియా వంద పడకల హాస్పిటల్ సుందరంగా రూపుదిద్దుకుంది. ఈ మేరకు ఈ నెల 28న మంత్రి చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాటు చేస్తుంది.

రూ.40 కోట్లతో వంద పడకల ఆసుపత్రి

మోడల్ నియోజకర్గంగా డోన్‌ను తీర్చిదిద్దుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌లో వంద పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు గుత్తి రోడ్డులో పదెకరాల విస్తీర్ణంలో మూడు అంతస్తుల వంద పడకల నిర్మాణం చేపట్టారు. మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుందరంగా భవన నిర్మాణం చేపట్టారు. భవనం నాలుగు దిక్కులా ఒకే విధంగా ఉండేలా అత్యంత సుందరంగా రూపకల్పన జరిగింది. ఆసుపత్రి చుట్టూ నాలుగు ప్రధాన ద్వారాలు, రెండు లిఫ్టులు ఏర్పాటు చేశారు. లివర్, కిడ్నీ, క్యాన్సర్, చెవి, ముక్కు, నరాలు, మెదడు, ఊపిరితిత్తులు లాంటి అనేక విభాగాలకు ప్రత్యేక గదులు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, ఎక్సరే యూనిట్ల నిర్మాణం చేపట్టారు. మహిళల కోసం ప్రత్యేక ప్రసూతి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం పర్యవేక్షించడంతో వందపడకల ఆసుపత్రి భవనం ఏడాదిలోనే పూర్తిచేశారు. ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానున్నడంతో డోన్ నియోజకవర్గ ప్రజలు ప్రజారోగ్య పదిలం అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాలతో పాటు కర్నూలు జిల్లాలోని క్రిష్ణగిరి, వెల్దుర్తి, దేవనకొండ, తుగ్గలి, పత్తికొండ, మద్దికెర మండలాల ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి వైద్యసేవలు కావాలన్నా డోన్ ప్రభుత్వాసుపత్రి ప్రధాన కేంద్రం కానుంది. కర్నూలు సర్వజన వైద్యశాలకు ఇకపై వెళ్లాల్సినవసరం ఉండదు. దీంతో సీఎం జగనన్నతోపాటు మంత్రి బుగ్గనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అన్ని పోస్టులు మంజూరు

మంత్రి బుగ్గన చొరవతో వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో సేవలకు అనుగుణంగా ఇప్పటికే ఆరు సివిల్ సర్జిల్, 15 అసిస్టెంట్ సివిల్ సర్జన్, రెండు డెంటల్, ఒక హెడ్ నర్స్, 12 స్టాఫ్ నర్స్, నర్సింగ్ సూపరింటెండెంట్, రేడియోగ్రాఫర్, ఫార్మాసిస్ట్, సూపర్‌వైజర్ పోస్టులు మంజూరయ్యాయి. అదేవిధంగా ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అటెండెంట్, బయో మెడికల్ ఇంజనీర్, ఆడియో మెట్రిక్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, పోస్టుమార్టం అసిస్టెంట్, నాలుగు థియేటర్ అసిస్టెంట్ పోస్టులు, ఐదు ఫార్మాసిస్టులు, గ్రేడ్ 2 పోస్టులు రెండు, ల్యాబ్ టెక్నీషియన్ 3, డార్క్‌రూం అసిస్టెంట్ 3తో పాటు మొత్తం 96 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది.



వైద్యుల కోసం నిర్మించిన గదులు



ఆసుపత్రి ప్రధాన ద్వారం



రెండవ అంతస్తులో ఆపరేషన్ థియేటర్

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నారు. 44వ జాతీయ రహదారి, రైల్వే జంక్షన్ ఉన్నందున అనేక ప్రమాదాలు జరిగి సకాలంలో ప్రజలకు వైద్యం అందేది కాదు. దీంతో చాలా మంది క్షతగాత్రులు మృత్యువాత పడ్డారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో డోన్ ఏరియా వంద పడకల హాస్పిటల్ అన్ని హంగులతో నిర్మాణం అయ్యింది. ఇక ప్రజారోగ్యానికి రక్షణ ఉంటుంది. మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు. – రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ, డోన్

సకల సేవలు ఉచితం



ప్రస్తుతం 800 వరకు ఉన్న ఓపీలు కొత్త ఆసుపత్రిలో వెయ్యికి పైగా అయ్యే అవకాశం ఉంది. తొమ్మిది మండలాల ప్రజలకు అందుబాటులో ఉండటమే కాక మహిళల ప్రసవాల సంఖ్య కూడా ప్రతి నెలా 100 నుండి 250 వరకు పెరిగే అవకాశం ఉంది. వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో అన్నివిభాగాల నుంచి రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందుతాయి. రాబోయే రోజుల్లో పెద్దాసుపత్రిగా పేరొందుతుంది.

– డాక్టర్ రమ్యశిల్ప, సీనియర్ గైనకాలజిస్ట్, ప్రభుత్వాసుపత్రి, డోన్.

ఆధునిక వసతులు



అత్యంత ఆధునిక వసతులతో డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రిని నిర్మించారు. కర్నూలు సర్వజన వైద్యశాలకు దీటుగా వసతులు ఉన్నాయి. రోగులకు మెరుగైన వైద్యసేవలు, చికిత్సలు అందుతాయి. కర్నూలు పెద్దాసుపత్రికి రద్దీ తగ్గే అవకాశం ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారు.

– డాక్టర్ మాధవక్రిష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు సర్వజన వైద్యశాల.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆటల పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె రూరల్ : గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను కాటసాని ఓబులరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, క్రీడాకారులు సుదర్శన్ రెడ్డి, పాపిరెడ్డి, అక్తర్, అఖిల్ హుస్సేన్ వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు బనగానపల్లె క్రికెట్ జట్టు

బనగానపల్లె పట్టణ పరిధిలోని నాల్గవ సచివాలయ క్రికెట్ జట్టు జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తెలిపారు. క్రీడాకారులను షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌తాహీర్ తదితరులు అభినందించారు.

మానవత్వంతో రక్తదానం చేయండి

బేతంచెర్ల: ఆపద సమయంలో బాధితుల ప్రాణాలు నిలవడానికి మానవత్వంతో రక్తదానం చేయాలని ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ మధన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ద్వారకామయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కంపెనీ యువకులు, ప్రజలు, రక్తదానం చేశారు. కార్యక్రమంలో లైఫ్ రక్త సహాయ బృందం కన్వీనర్ రవికుమార్, డీపీఎం జయరామ్ సింగ్, పీఆర్వో నాయుడు, సర్వేయర్ అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చేతికర్రల పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక రోటరీక్లబ్ భవనంలో ఆ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగుడికి చేతికర్రలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టణానికి చెందిన దివ్యాంగుడు ఉసేన్‌వలికి క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి చేతికర్రలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు మోహనమూర్తి, బాలాంజనేయరెడ్డి, దివ్యాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మేకల దేవరాజు అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. గ్రామ సమీపాన ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వ వద్ద మద్యం విక్రయిస్తుండగా నిందితుడిని అరెస్టు చేసి, 48 మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు బనగానపల్లె కోర్టులో హాజరుపరచగా జడ్జి కిశోర్‌కుమార్ 15 రోజుల రిమాండ్ ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవ్వ గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్లలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం సాయంత్రం ప్రారంభోత్సవం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, బూత్ కమిటీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, గృహసారధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గురి దొంగల అరెస్టు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పండ్లాపురం గ్రామ శివారు ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే ఐరన్ రాడ్‌లు అపహరణకు పాల్పడుతున్న బోయ మధుగోవింద్‌నాయుడు, షేక్ మహమ్మద్‌రఫీ, తలారి మద్దిలేటిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. బనగానపల్లెకు చెందిన వీరు పండ్లాపురం గ్రామ శివారు ప్రాంతంలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించే సుమారు రూ.15వేల విలువ ఐరన్ రాడ్‌లు అపహరిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డోన్ విద్యార్థులకు జాతీయ మెరిట్ స్కాలర్ షిప్

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ మెరిట్ స్కాలర్ షిప్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్)కు ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. 8వ తరగతి అఖిల్, మోహన్ అర్హత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర చారన్నారు. వీరికి ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున ఐదేళ్లపాటు స్కాలర్‌షిప్ పొందుతారన్నారు.

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్ : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు హనీఫ్,బానుసింగ్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు. అనంతరం ఆర్డీఓ వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు.



కుక్క పిల్లలను బయటకు తీస్తున్న యువకులు



తల్లి వద్దకు చేరిన కుక్క పిల్లలు

అమ్మ...ఎవరికైనా అమ్మే!

డోన్ టౌన్ : అమ్మ ఎవరికైనా అమ్మే అని నిరూపించింది ఓ శునకం. అమ్మ ప్రేమకు హద్దు లేదనే వాస్తవం. పిల్లలు ఆపదలో ఉంటే తల్లిపడే వేదన అంతా ఇంతా కాదు. జంతువులకు సైతం ఇలాంటి సందర్భం ఎదురైనప్పుడు అవిపడే తపన మనిషికి అమ్మప్రేమ అర్థాన్ని గుర్తు చేస్తుంటాయి. పట్టణంలోని షాదీఖానా వద్ద పాడుబడిన టిలికాం భవనంలో ఓ శునకం రెండు రోజుల కిందట మూడు కూనలకు జన్మనిచ్చింది. గురువారం మధ్యాహ్నం ప్రమాద వశాత్తూ పిల్లలున్న చోట ఉండే చెత్తకు నిప్పంరగిలి మంటలు వ్యాపించాయి. దీంతో కూనలు గీతరించాయి. వాటిని రక్షించుకునేందుకు తల్లిశునకం తల్లడిల్లింది. కూనలను రక్షించుకునేందుకు పడరానిపాట్లు పడింది. అటుగా వెళ్తున్న మనుషులకు అడ్డుగా వెళ్లి తిరిగి మంటలు ఉన్న చోటికి పరిగెత్తి తన బాధనుల తెలియజేంది తల్లిశునకం. అమ్మ బాధను అర్థం చేసుకున్న మహాబూబ్ బాషా, అల్తాఫ్, షాదిఖానా రాజు మంటల్లో చిక్కుకున్న కూనలను రక్షించారు. సబ్ జైల్ గోడ వైపు చేర్చడంతో తల్లిశునకం కూనలను అక్కున చేర్చుకుంది.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఆర్‌ఓ కామేశ్వరరావు



మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఈఆర్‌ఓ) కామేశ్వరరావు తెలిపారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులతో పట్టణంలోని ప్రధాన రోడ్లలో ర్యాలీ నిర్వహించారు. అలాగే పట్టణంలోని కస్బా ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ బూత్ వద్ద ఈఆర్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పెట్రోల్‌బంకు సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు పై ఈఆర్‌ఓ కామేశ్వరరావు ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఓ రాఘవేంద్ర, వీఆర్‌ఓలు ఈశ్వర్‌రెడ్డి, సురేంద్ర, గోపాల్, గంగన్న ప్రసాద్, గ్రామపంచాయతీ ఈఓ ఖలీల్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: దేశభవిష్యత్తును నిర్ణయించే ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ పుష్పకుమారి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోవెలకుంట్ల మండలంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలంతో పాటు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్‌ఓలు చెన్నయ్య, రాజశేఖర్‌రెడ్డి, షఫియా, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంజామల: ఓటు హక్కును యువత వదులుకోవద్దని,ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున రావు అన్నారు.గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కార్యాలయం నుంచి పాత పోలీస్ స్టేషన్ సెంటర్ వరుకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్, ఆర్‌ఐ వెంటల్ రెడ్డి, వీడీ బాషా తదితరులు పాల్గొన్నారు.



సంజామల: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ మల్లికార్జున రావు, సిబ్బంది

అవుకు:అవుకు మండలంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం నుంచి బస్టాండ్, తేరువీధి, సెంటర్, మార్కెట్ ఏరియాల మీదుగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణంలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు శ్రీధర్ రావు, వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌ఐ రాముడు, వీఆర్‌ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

డోన్ : ఓటు హక్కు అనే వజ్రాయుధంతో సమానమని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు, సీసీలు, విద్యార్థులు పట్టణంలో చేపట్టిన ర్యాలీని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి ఆర్డీఓ ప్రారంభించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన యువజన సమావేశంలో సీనియర్ సిటిజన్లు మౌలాలి, హనీఫ్, భానుసింగ్, గోపాల్, గాలయ్యలను ఆర్డీఓ వెంకటరెడ్డి సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఓటు ప్రాముఖ్యతను ఆర్డీఓ వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విద్యుత్ ఈఈ ప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయ ఆవరణలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఓటు విలువ గురించి వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈ రమణారావు, ఏఈలు రమాదేవి, నాగేశ్వరరెడ్డి, జేఈలు రామకృష్ణ, నాగరాజు, శివ, ఖుషీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆయుధం లాంటిదని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మారుతి, హెచ్‌ఎం పద్మాబాయి తదితరులు పాల్గొన్నారు.


బేతంచెర్ల: ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఏలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం ను పురస్కరించుకొని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి ఆర్‌ఐ శ్రీదేవి, వీఆర్వోలు, సర్వేయర్లు సిబ్బంది, ప్రతిజ్ఞ చేశారు. అలాగే విద్యుత్ ఏడీ కార్యాలయంలో ఏడీ మధుసూదన్ రెడ్డి, ఏఈలు శ్రీనివాసులు, మహబూబ్ వలి విద్యుత్ సిబ్బందితో కలిసి జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.



డోన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ సిబ్బంది



ప్యాపిలి: మాట్లాడుతున్న తహసీల్దార్



బేతంచెర్ల : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

27 నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

అవుకు: నవరత్నాలు పథకాల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఈ నెల 27 వతేదీ నుంచి ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు గురువారం తెలిపారు. అవుకు మండలంలో 861 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇంటి పట్టాతో పాటు ఇద్దరు సాక్షులను ఆయా గ్రామ సచివాలయాలకు తీసుకెళ్తే జూనియర్ సబ్ రిజిస్ట్రార్ హోదాలో ఆయా పంచాయతీ సెక్రటరీలు లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు అవకాశం ఉందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలో 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. రామాపురం గ్రామం ఊరివెలుపల ఉన్న గనుల్లో గ్రామానికి చెందిన దస్తగిరమ్మ నాటుసారాను అమ్ముతుండగా దాడి చేశామన్నారు. ఆమె పరారయ్యిందని, సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

సన్మానం

బేతంచెర్ల: గోర్లగుట్ట లో రజకుల సౌకర్యార్థం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి బోర్ వేయించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం దగ్గర గోర్లగుట్ట గ్రామ రజకులు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ నాయకులు చలపతి రెడ్డి, వెంకిరెడ్డి, బాల వెంకట రెడ్డి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో రజకులు కృష్ణుడు, నాగరాజు, సుబ్బు, బుజ్జి, కిట్టు, లక్ష్మన్న పాల్గొన్నారు.